# సాక్షి
# విశాఖపట్నం

శనివారం । 1 । ఏప్రిల్ । 2023






**నేర నియంత్రణపై దృష్టి**

క్రైం రేట్ మరింత తగ్గే విధంగా పనితీరు ప్రదర్శించాలని సీపీ సి.హెచ్.శ్రీకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. 8లో



**అట్టుడికిన గంగవరం పోర్టు**

గంగవరం పోర్టు అట్టుడికింది.. జీపీఎస్ కార్మికుల ఆందోళనతో దద్దరిల్లింది.. నినాదాలతో హోరెత్తింది. 8లో



**పోలియో నిర్మూలనలో మేము సైతం**

పోలియో రహిత సమాజ నిర్మాణంలో ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్(ఈపీజీసీ) కూడా భాగస్వామ్యం వహిస్తోంది. 10లో

## న్యూస్‌రీల్

### నలుగురు సీఐలకు స్థానచలనం

దొండపర్తి (విశాఖ దక్షిణ): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు సీఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఆర్‌బీ సీఐగా ఉన్న ఇ.నరసింహారావును గోపాలపట్నం లా అండ్ ఆర్డర్‌కు, హార్బర్ సబ్ డివిజనల్(క్రైం) సీఐగా ఉన్న ఎం.అవతారంను సీసీఆర్‌బీకి బదిలీ చేశారు. అలాగే గోపాలపట్నం లా అండ్ ఆర్డర్‌లో విధులు నిర్వర్తిస్తున్న కె.సతీష్‌కుమార్‌ను పెందుర్తి లా అండ్ ఆర్డర్ సీఐ ఇ.వెంకునాయుడులను రేంజ్ వీఆర్‌కు పంపించారు.

### శిశుగృహలో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అదనపు ఎస్పీ స్వరూపారాణీ

మద్దిపాలెం : ఆర్అండ్‌బి జంక్షన్ దరి ఉన్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ శిశుగృహలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ జి.స్వరూపారాణి నేతృత్వంలో శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. శిశుగృహలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. సిబ్బంది హాజరు పట్టీతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో ఆరు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

### జూలో వన్యప్రాణుల వివరాలు ప్రదర్శించండి



జూలో బయోస్కోప్ నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి

ఆరిలోవ (విశాఖ తూర్పు): ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణుల వివరాలతో ప్రత్యేకమైన బోర్డులు ఏర్పాటు చేయాలని సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి జూ అధికారులకు సూచించారు. ఆయన శుక్రవారం జూ పార్కును సందర్శించారు. జూలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. జూ బయోస్కోప్‌పై నిర్మిస్తున్న అదనపు అంతస్తు పనులు పరిశీలించారు. దీంతో పాటు ఇటీవల ఇక్కడ నిర్మించిన కొన్ని ఎన్‌క్లోజర్లు, అభివృద్ధి పనులు పరిశీలించారు. అభివృద్ధి పనులు నాణ్యతతో జరిపించాలి జూ ఇన్‌చార్జి క్యూరేటర్, డీఎఫ్‌వో అనంత్ శంకర్‌కు సూచించారు. ఎన్‌క్లోజర్ల వద్ద వన్యప్రాణుల జీవిత వివరాలతో పాటు వాటిని ఎక్కడ నుంచి తీసుకొచ్చారు, ఎప్పుడు తీసుకొచ్చారు, వాటి ఆహార అలవాట్లు తదితర వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జూకి వచ్చే సందర్శకులకు వన్యప్రాణులపై అవగాహన కలుగుతుందన్నారు.

### వాల్తేర్ కేవీలో ఒకటో తరగతిలో ప్రవేశాలు

తాటిచెట్లపాలెం: పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి ఎదురుగా, జాతీయ రహదారి పక్కనే ఉన్న కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతికి ఆన్‌లైన్‌లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని ప్రిన్సిపాల్ కమల్‌జీత్ తెలిపారు. ఏప్రిల్ 17 వరకు ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండో తరగతికి మాత్రం కొన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఏప్రిల్ 3 నుంచి 12వ తేదీ వరకు స్కూల్ వద్ద దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సీట్లు ఖాళీ లేవని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

### ఎల్‌వీపీ కంటి ఆస్పత్రికి పదో ర్యాంక్

ఆరిలోవ: ఎల్.వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్‌వీపీఈఐ)కి ప్రపంచ వ్యాప్తంగా పదో ర్యాంక్ సాధించినట్లు నగరంలో హనుమంతవాక వద్ద ఎల్వీపీ కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ భవిక్ శుక్రవారం తెలిపారు. స్పెయిన్‌కు చెందిన ప్రపంచ ర్యాంకింగ్ సంస్థ, ఎస్.సి ఇమాగో ర్యాంకింగ్ ఏజెన్సీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధనలు చేపట్టారన్నారు. ఆయా సంస్థలు సంయుక్తంగా వైద్యశాలలపై చేపట్టిన పరిశోధన ప్రచురణ, విష్కరణలు, పరిశోధన ఉత్పాదనల సామాజిక ప్రభావం, నాణ్యత, తదితర వాటిలో మిశ్రమ సూచిక ఏర్పాటు చేశారన్నారు. వివిధ రకాల పరిశోధనలు, వెబ్ అనలిటిక్స్ డాటా సెట్లు ద్వారా ఈ మిశ్రమ విలువలు లెక్కించి ర్యాంకింగ్ నిర్ణయించారన్నారు. దీనికి సంబంధించిన ఐదేళ్ల డేటాను పరిశీలించినట్లు తెలిపారు. ఈ ర్యాంకింగ్‌లో ఎల్‌వీపీఈఐ టాప్–10లో ఒకటిగా నిలిచిందన్నారు. టాస్–10లో ఎల్‌వీపీఈఐ నిలవడంపై ఆనందంగా ఉందన్నారు.

# ఉజ్వల విశాఖ



జీఐఎస్‌ను ప్రారంభిస్తున్న సీఎం జగన్. చిత్రంలో రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీ (ఫైల్)



విద్యుత్ వెలుగుల్లో విశాఖ నగరం

- మూడు నెలల్లో నాలుగు కీలక అంతర్జాతీయ సదస్సులు
- వేదికగా నిలిచిన మహా నగరం
- పెట్టుబడుల సదస్సుతో వాణిజ్య కేంద్రంగా వైజాగ్
- తీపి జ్ఞాపకాలనందించిందన్న జీ20 దేశాల ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : పరిపాలన రాజధానిగా కాబోతున్న నేపథ్యంలో వైజాగ్.. అంటే ఓ బ్రాండ్ ఇమేజ్ అన్నట్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్రెండ్ సెట్ చేశారు. మూడు నెలల వ్యవధిలో నాలుగు అంతర్జాతీయ సదస్సులకు వేదికగా నిలిచి, ప్రతి సదస్సును విజయవంతంగా నిర్వహించిన విశాఖ నగరం.. దేశ విదేశీ ప్రతినిధుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంది. ఐటీ సదస్సులతో టెక్నాలజీ ఐకాన్ సిటీగా పేరొందిన నగరం.. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ విజయవంతంగా నిర్వహించిన తర్వాత పెట్టుబడులకు స్వర్గధామంగా మారింది. నాలుగు రోజుల పాటు నిర్వహించిన జీ20 సదస్సుతో అందరి నోటా ఒకే మాట.. దేశానికి ఆర్థిక కోట.. విశాఖ.. అనే ఇంటర్నేషనల్ బ్రాండ్‌ను సొంతం చేసుకుంది. నాలుగు రోజుల పాటు ఆతిథ్యమిచ్చిన వైజాగ్.. మంచి జ్ఞాపకాల్ని అందించిందంటూ విదేశీ ప్రతినిధులు చెబుతుండటం విశేషం.

**సదస్సు ఏదైనా సూపర్ సక్సెస్**

అభివృద్ధి చెందుతున్న ద్వితీయ శ్రేణి నగరాల్లో అగ్రభాగంలో ఉన్న విశాఖపట్నంలో ఏ సదస్సు నిర్వహించినా సూపర్ సక్సెస్ అని మరోసారి నిరూపితమైంది. ప్రణాళికా బద్ధంగా జీ20 సదస్సు నిర్వహణతో అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు పెట్టుబడుల సదస్సులు నిర్వహించినా.. కానరాని ఇమేజ్.. ఈ ఏడాది నిర్వహించిన సదస్సులతోనే సొంతం చేసుకుంది. జీఐఎస్‌తో వైజాగ్ పేరు ఖండాంతరాలు దాటగా జీ20తో విశ్వవ్యాప్తమైంది. ఈ ఏడాది తొలినాళ్లలో రాష్ట్ర ప్రభుత్వం, ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ(ఐటాప్) ఆధ్వర్యంలో 'ఇన్ఫినిటీ వైజాగ్' సదస్సు నిర్వహించారు. అనంతరం గ్లోబల్ టెక్ సమ్మిట్ జరిగింది. ఈ రెండు సదస్సులకు 40కి పైగా దేశాలకు చెందిన విదేశీ ప్రతినిధులు హాజరై వైజాగ్



సిటీ వైభవాన్ని చూసి ముగ్ధులయ్యారు. వైజాగ్.. ఐటీ రంగానికి డెస్టినేషన్ అని కొనియాడారు.

**జీఐఎస్‌తో కొత్త ఇమేజ్..**

రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించిన తర్వాత నగరానికి సరికొత్త ఇమేజ్ వచ్చింది. విశాఖపట్నం సమగ్రాభివృద్ధి చేసేందుకు ఎంతో అవకాశం ఉన్న నేపథ్యంలో ఎవరు వచ్చినా ఆహ్వానించదగ్గ ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న నగరంలో తమ వ్యాపార కార్యకలాపాలు విస్తరించాలన్న ఆలోచనలు పారిశ్రామికవేత్తలు స్వయంగా చూసిన తర్వాత రూఢీ చేసుకున్నారు. నివాస యోగ్య నగరాల్లో టైర్–1 సిటీలతో పోటీ పడుతున్న విశాఖపట్నం పెట్టుబడులకు కూడా ప్రధాన కేంద్రంగా మారింది. అంతర్జాతీయ సంస్థలు కూడా విశాఖ జిల్లాలో తమ కార్యకలాపాలు విస్తరించేందుకు ముందుకొచ్చాయంటే దీనికి కారణం.. వైజాగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి అన్నది జగమెరిగిన సత్యం.

**జీ20తో అంతర్జాతీయ ఖ్యాతి**

భిన్న వాతావరణం, విభిన్న సంస్కృతులు, మెచ్చే భాషలు, ఆది నుంచి దూసుకుపోతున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విశాఖపట్నం వైపు చూసేలా చేస్తున్నాయి. జీఐఎస్ విజయవంతం అనంతరం నాలుగు రోజుల పాటు జరిగిన జీ20 సదస్సు అద్భుతంగా జరిగింది. నగరాల అభివృద్ధి, ఆర్థిక పురోగతి, నిధుల సమీకరణ తదితర అంశాలపై సెషన్లు నిర్వహించారు.

అనంతరం నగర పర్యటనలో భాగంగా జీ20 దేశాల ప్రతినిధులు నగర సందర్శన చేశారు. నగర అభివృద్ధికి చిహ్నంగా వినూత్నంగా ప్రాజెక్టులు నిర్వహించడాన్ని విదేశీ ప్రతినిధులు ప్రశంసించారు. మార్చి 28న సదస్సు ప్రారంభం రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై.. విదేశీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. విశాఖ నుంచి వెళ్లేటప్పుడు మధురమైన జ్ఞాపకాల్ని తీసుకెళ్తారని సీఎం వైఎస్ జగన్ చెప్పినట్లుగా.. జీ20 సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ.. అదే ఫీలింగ్‌తో బయలుదేరారు. సదస్సు విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించిన జిల్లా అధికారయంత్రాంగం, పోలీసులకు కలెక్టర్ డా.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

# పన్నుల వసూలులో రికార్డు

- జీవీఎంసీకి లక్ష్యాన్ని మించి ఆదాయం..
- రూ.421 కోట్ల వసూళ్లు
- ముగిసిన వడ్డీ రాయితీ
- నేటి నుంచి అమల్లోకి కొత్త పన్నులు



డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో పన్ను బకాయిదారులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీ శుక్రవారం అర్ధరాత్రితో ముగిసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది ఆస్తిపన్నుపై వడ్డీని మాఫీ చేస్తూ నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రికార్డు స్థాయిలో పన్నులు వసూళ్లయ్యాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.320 కోట్లు పన్నులు వసూళ్లు కాగా, మరో రూ.50 కోట్లు లక్ష్యంగా, మొత్తం రూ.375 కోట్లు వసూళ్లకు చర్యలు చేపట్టారు. ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అనుకున్న లక్ష్యానికి (రూ.375 కోట్లు)మించి శుక్రవారం రాత్రి వరకు అన్ని జోన్ల పరిధి నుంచి రూ.421 కోట్లు పన్నుల రూపంలో ఆదాయం సమకూరింది.

**నేటి నుంచి కొత్త పన్నులు..**

2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల వసూళ్లు శుక్రవారం రాత్రి ముగిసింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త పన్నులు ప్రారంభంకానున్నాయి. జీవీఎంసీలో కొత్త బడ్జెట్ వినియోగంతో పాటు కొత్తగా పెరిగిన పన్నులు వసూలు చేయనున్నారు. గతంలో అద్దె ప్రాతిపదికన పన్నులు పెంచి వసూలు చేసేవారు. కానీ ప్రస్తుతం దేశ వ్యాప్తంగా నూతన సంస్కరణలు అనుసరిస్తూ భూముల ధరలు బట్టి సబ్‌రిజిస్ట్రార్ వాల్యూ ప్రకారం పన్నులు పెంచి వసూలు చేస్తారు.

### సీఎం నిర్ణయంతో..



పన్నులపై వడ్డీ రాయితీ ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం కారణంగా ఊహించని సత్ఫలితాలు వచ్చాయి. జీవీఎంసీకి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ ప్రకటన ప్రకటించిన సందర్భంగా ప్రజలు, వివిధ సంస్థలు, తమ ఆస్తి పన్నులను భారీ స్థాయిలో చెల్లించేందుకు ఆసక్తి చూపించారు. జీవీఎంసీ గత ఆర్థిక సంవత్సరంలో రూ.324.24 కోట్లు వసూలు చేస్తే..ఇప్పుడు రూ.421 కోట్ల ఆదాయం సమకూరింది. తనతో పాటు జీవీఎంసీ యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సహకారంతో ఇది సాధ్యమైంది.

– గొలగాని హరివెంకటకుమారి, మేయర్

### నగర ప్రజలకు కృతజ్ఞతలు



జీవీఎంసీ ఆస్తి, ఖాళీ జాగా పన్నుల రూపేన ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యానికి మించి వసూలవడం చాలా ఆనందంగా ఉంది. రాష్ట్రంలో అతి పెద్ద కార్పొరేషన్ అయిన జీవీఎంసీ పరిధిలో 5.59 లక్షల ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) లక్ష్యానికి మించి పన్నులు వసూలు చేయగలిగాం. సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి విశాఖ నగర పాలక సంస్థకు చేయూతనిచ్చిన విశాఖజిల్లా వాసులకు కృతజ్ఞతలు. జీవీఎంసీ పాలకవర్గం, యంత్రాంగం సమష్టిగా సాధించిన విజయం ఇది. ఆస్తిపన్నుపై ప్రభుత్వ రాయితీ ప్రకటించడంతో జీవీఎంసీకి భారీ ఆదాయం సమకూరింది.

– పి.రాజాబాబు, జీవీఎంసీ కమిషనర్

# జేఎస్‌డబ్ల్యూ బృందానికి నిరసన సెగ



జేఎస్‌డబ్ల్యూ బృందంతో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం (గాజువాక): జిందాల్ స్టీల్‌ప్లాంట్ బృందం శుక్రవారం స్టీల్‌ప్లాంట్‌కు వచ్చింది. సమాచారం తెలుసుకున్న పోరాట కమిటీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల యాజమాన్యం వస్తు మార్పిడిపై ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) ప్రకటన చేసిన విషయం విదితం. ఈ నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ బృందం శుక్రవారం ఉక్కు పరిపాలన భవనానికి వచ్చింది. ఈ విషయం తెలిసిన పోరాట కమిటీ నాయకులు అక్కడకు చేరుకుని అధికారుల కార్యాలయం ముందు బైఠాయించారు. కొంత సేపటి తర్వాత బృంద సభ్యులు బయటకు రాగా పోరాట కమిటీ నాయకులు అడ్డుకున్నారు. చర్చల విషయం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, మరోసారి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్లాంట్‌లోకి ప్రైవేటు వ్యక్తులను కొందరు అధికారులు ఆహ్వానిస్తున్నారని, వారికి తగిన గుణపాఠం చెబుతామని పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, వై. మస్తానప్పలు హెచ్చరించారు.

# పది పరీక్షలకు ఏర్పాట్లు



- జిల్లాలో 136 కేంద్రాలు ఏర్పాటు
- ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు
- డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: జిల్లాలో ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాటు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లాలో 27,547 మంది రెగ్యులర్, మరో 1,739 మంది ప్రైవేటు (వన్స్ ఫెయిల్డ్) విద్యార్థులు పరీక్షలకు హాజరౌతున్నారని తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కేంద్రాల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. పరీక్షల నిర్వహణకు 136 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇందులో ఏ- కేటగిరీ కింద 50, బీ- కేటగిరీ కింద- 77, సీ-కేటగిరీ కింద 9 కేంద్రాలు ఉన్నాయన్నారు. 136 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 136 డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 14 రూట్ ఆఫీసర్లు, మరో 14 మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు. ఈ సారి ప్రశ్నా పత్రాలపై ప్రత్యేక గుర్తింపు నంబర్ ఉంటుందని, ఎక్కడైనా ప్రశ్నాపత్రం బయటకు వస్తే, అది ఏ కేంద్రంలో నుంచి వచ్చిందనేది తెలుసుకోవచ్చన్నారు. ప్రైవేటు స్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఆ పాఠశాలకు చెందిన వారెవ్వరూ ఉండకూడదన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు తీసుకురాకూడదన్నారు. ప్రైవేటు స్కూళ్లలో ఫీజు బకాయిల పేరిట హాల్ టికెట్లు నిరాకరించకూడదని స్పష్టం చేశారు. ఏమైనా ఇబ్బందులుంటే 9440787228, 77804553490కు సంప్రదించాలన్నారు.

# వాయుకాలుష్యం.. లెక్క పక్కా

- మొబైల్ ఎయిర్ పొల్యూషన్ మానిటరింగ్ వ్యవస్థ ప్రారంభం
- డీఎస్‌టీ నిధులతో విద్యార్థులకు ఉపయుక్తం



మొబైల్ పొల్యూషన్ మానిటరింగ్ వ్యవస్థను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం మీటియరాలజీ, ఓషనోగ్రఫీ విభాగానికి నూతనంగా డీఎస్‌టీ నిధులతో మొబైల్ ఎయిర్ పొల్యూషన్ మానిటరింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేశారు. డీఎస్‌టీ ఫిస్ట్ పథకంలో భాగంగా రూ.50 లక్షలతో దీనిని సమకూర్చారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి శుక్రవారం విభాగం వద్ద మొబైల్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నగరంలోని విభిన్న ప్రాంతాలలో వాయుకాలుష్యాన్ని గణించడానికి ఈ పరికరాలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. విభా గ విద్యార్థులు, పరిశోధకులు విశాఖ నగరంలోని నిర్దిష్ట ప్రాంతాలలో ఈ మొబైల్ వాహనాన్ని తీసుకువెళ్లి నిరంతరం వాయుకాలుష్యాన్ని గుర్తించడానికి, సేకరించిన సమాచారం ఆధారంగా విశ్లేషణ చేయడం, కచ్చితమైన ఫలితాలను అందించడానికి సాధ్యపడుతుందన్నారు. విభాగంలో అధునాతన వసతులు, నిష్ణాతులైన ఆచార్యులు ఉన్నారని వీరి మార్గదర్శకంలో విద్యార్థులు పనిచేస్తారన్నారు.

**డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభిస్తున్నాం**

ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉపయుక్తగా ఈ నెల 6న డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ తయారీ, వినియోగం,శిక్షణపై శిక్షణ అందించే కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. హెలీప్యాడ్ గ్రౌండ్‌లో విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించడానికి వినియోగిస్తామన్నారు. డ్రోన్ టెక్నాలజీ కేంద్రం సహకారంతో భూమి పైభాగం నుంచి నిర్ణీత ఎత్తులో కూడా వాయుకాలుష్య ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ దిశగా మీటియరాలజీ విభాగం ఆలోచన చేయాలన్నారు.

**మెరుగైన ఉపాధి అవకాశాలు**

ఆంధ్రవిశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలో 70 శాతం మందికిపైగా విద్యార్థులకు ఇప్పటికే ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో ఒక్కో విద్యార్థికి రెండు కంటే అధికంగా ఉద్యోగాలు సాధించారన్నారు. ఎలక్ట్రికల్, ఇనుస్ట్రుమెంటేషన్, కెమికల్ విభాగాల విద్యార్థులకు అత్యధిక డిమాండ్ ఏర్పడిందన్నారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు , రెక్టార్ ఆచార్య కె.సమత, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, విభాగాధిపతి ఆచార్య పి.సునీత, సి.వి నాయుడు, విశ్రాంత ఆచార్యులు ఓ.ఎస్.ఆర్.యు భాను కుమార్, ప్రసాద్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎలా పనిచేస్తుందంటే

మొబైల్ వాహనానికి ప్రత్యేకమైన సెన్సార్లు అనుసంధానం చేశారు. పరికరం పై భాగంలో ఉన్న ఒక ప్రత్యేకమైన పంప్ గాలిలో ఉన్న ధూళి కణాలను సేకరిస్తుంది. అనంతరం వీటి పరిమాణం ఆధారంగా ఐదు రకాలుగా వేరుచేసి వివరాలు అందిస్తుంది. 10 మైక్రో గ్రాములు అంతకంటే నాలుగురెట్లు తక్కువ పరిమాణంలో ఉన్న అతిసూక్ష్మ కణాలను సైతం గుర్తించి సమగ్ర వివరాలు ఇక్కడ పొందే అవకాశం ఉంది. ప్రాథమికంగా రుషికొండ, ఆర్కే బీచ్, ఎస్ఎస్‌టీఎల్, ఆటోనగర్, గంగవరం ప్రాంతాలో అధ్యయనం చేస్తారు. ప్రత్యేకమైన నైట్రోజన్ ఎనలైజర్స్ దీనిలో ఉంటాయి. నైట్రోజన్ ఆక్సైడ్,నైట్రస్ ఆక్సైడ్ వంటి నైట్రోజన్ వాయువులను గుర్తిస్తారు. దీంతో పాటు వాతావరణానికి సంబంధించిన పలు వివరాలు సైతం పొందే అవకాశం ఉంది. విండ్ స్పీడ్, విండ్ డైరెక్షన్, ఉష్ణోగ్రతలు, హ్యుమిడిటీ, అట్మాస్ఫియర్ ప్రెషర్ వంటివి కూడా తెలుసుకునే అవకాశం ఉంది. ఈ సమాచారాన్ని పరిశోధకులకు సైతం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

# నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

ఏర్పాట్లపై డీఆర్‌వో శ్రీనివాస మూర్తి సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్‌వో శ్రీనివాస మూర్తి

విశాఖ విద్య: ఆయుష్ విభాగంలో మెడికల్ ఆఫీసర్లు, జూనియర్ లెక్చరర్స్/అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాల నియామకానికి సంబంధించి శనివారం నుంచి ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి తెలిపారు. వివిధ విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి లోపాలు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయుష్ విభాగంలో చేపట్టే మెడికల్ ఆఫీసర్లు, లెక్చరర్స్/అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి శనివారం నుంచి 3వ తేదీ వరకు రెండు పూటలా పరీక్షలు జరుగుతాయని, సుమారు 1,283 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని వివరించారు. అలాగే రెవెన్యూ విభాగంలో చేపట్టే జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల నియామకానికి సంబంధించి ఏప్రిల్ 4 నుంచి రెండు పూటలా పరీక్ష ఉంటుందని 1,250 మంది హాజరు కానున్నారని వెల్లడించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సహాయక కార్యదర్శి బి.సి.హెచ్.ఎస్. కుమార్ రాజు, ఎఏ స్‌వో ఎస్. ప్రతాప్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణపై దృష్టి పెట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్

**దొండపర్తి:** నగరంలో క్రైం రేట్ మరింత తగ్గే విధంగా పనితీరు ప్రదర్శించాలని నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్ల పనితీరును సీపీ పరిశీలించారు. క్రైం, ట్రాఫిక్ విభాగాలపై సమీక్షించారు. పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలని, వాటిని సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. కోర్టు తీర్పు వెలువరించిన కేసుల వివరాలను తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్లకు సీనియర్ అధికారుల సందర్శనపై ఆరా తీశారు. సైబర్ క్రైం వారియర్స్ శిక్షణపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. మహారాణిపేట ప్రాంతం రామజోగిపేటలో మూడు అంతస్తుల భవనం కూలిన ఘటనలో వెంటనే స్పందించి ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించిన పోలీస్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. డీసీపీ-1 సుమిత్ సునీల్ గరుడ్, డీసీపీ(క్రైం) జి.నాగన్న, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన సెల్ బలోపేతానికి చర్యలు

**వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి రజని**


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

**మహారాణిపేట:** కేజీహెచ్ గిరిజన సెల్ బలోపేతం చేసి రోగులకు మెరుగైన సేవలు అందించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని ఆదేశించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి గిరిజన సెల్‌కు సంబంధించి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజని మాట్లాడుతూ పాడేరు, అరుకులో కొత్తగా బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ గిరిజనసెల్‌కు ఖరీదైన మందులు, కాంట్రాస్ట్ స్కాన్ చేయడానికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. అంబులెన్స్‌ల సంఖ్యను పెంచాలన్నారు. అరుదైన రక్త నమూనాలకు సంబంధించిన సమస్యలను మంత్రికి వివరించారు. కాన్ఫరెన్స్‌లో కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్ కుమార్, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, డీసీహెచ్ఎస్ డా.రమేష్ కిశోర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సాంకేతికతతో ప్రమాదాల నివారణకు కృషి


చంద్రశేఖర్‌వర్మను సత్కరిస్తున్న ఎంపీఎస్ఆర్ఎం ప్రతినిధులు

**పరవాడ:** భద్రత నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించే దిశగా యాజమాన్యాలు కృషి చేయాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.చంద్రశేఖర్ వర్మ సూచించారు. జేఎన్ ఫార్మాసిటీలో మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 52వ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. వారోత్సవాలు పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనిలో ఏకాగ్రత చూపుతూ.. భద్రత లోపాలను అధిగమించాలన్నారు. జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు ప్రశాంతమైన మనసుతో ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పరిశ్రమల్లో ప్రమాదాలు తగ్గుతూ.. రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సొసైటీ అధ్యక్షుడు ఎం.శివరాం ప్రసాద్, కార్యదర్శి జెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, ఫార్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

# అట్టుడికిన గంగవరం పోర్టు

- జీపీఎస్ కార్మికుల ఆందోళనతో ఉద్రిక్తత
- కార్మికుడి ఆత్మహత్యాయత్నంతో వేడెక్కిన వాతావరణం
- పోలీసుల రంగప్రవేశం


ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన పేర్ల నూకరాజు

**పెదగంట్యాడ:** గంగవరం పోర్టు అట్టుడికింది.. జీపీఎస్ కార్మికుల ఆందోళనతో దద్దరిల్లింది.. పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తింది. జీతాలు పెంచి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున కార్మికులు నినాదాలు చేశారు. యాజమాన్య తీరుతో విసిగిపోయిన పేర్ల నూకరాజు అనే ఉద్యోగి ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డాడు. తోటి కార్మికుల సమక్షంలోనే ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ సమాచారం అందుకున్న న్యూపోర్టు పోలీసులు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. హార్బర్ ఏసీపీ శిరీష, న్యూపోర్టు సీఐ రాము, స్టీల్ ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు హుటాహుటిన అక్కడకు చేరుకుని.. ఉద్యోగులను శాంతింపజేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

**జీతాలు పెంచాలని కోరుతూ ఆందోళన**

తమకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులంతా శుక్రవారం ధర్నాకు దిగారు. కార్మికుల ఆందోళనకు మద్దతుగా 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను మద్దతు ఇచ్చారు. వారితో కలసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీపీఎస్ ఉద్యోగులు మాట్లాడుతూ 2009లో పోర్టులో ఉద్యోగాలు వచ్చాయని, అప్పట్లో నెలకు రూ.4,732 చొప్పున జీతాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఒక్కో ఉద్యోగికి రూ.8300 నుంచి 14,600 వరకూ మాత్రమే జీతాలు పెరిగాయన్నారు. ఉద్యోగంలో చేరిన దగ్గర నుంచి రూ.3700 మాత్రమే బేసిక్ ఇస్తున్నారన్నారు. 14 ఏళ్లలో ఇంత తక్కువగా జీతాలు పెంచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై పలుమార్లు పోర్టు యాజమాన్యం, లేబర్ కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించామని గుర్తు చేశారు. గంగవరం పోర్టు కోసం భూములు త్యాగం చేసిన తమకు ఇలా అన్యాయం చేయడం సరికాదన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను ఎలా నెట్టుకువస్తామని నిలదీశారు. ఆందోళనలు చేస్తే కార్మికులను అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు.


కార్మికులతో యాజమాన్య ప్రతినిధుల చర్చలు

**ఫలించని చర్చలు**

కార్మికుల ఆందోళన నేపథ్యంలో యాజమాన్యం దిగి వచ్చింది. జీతాల విషయంలో చర్చించేందుకు శుక్రవారం సాయంత్రం చర్చలకు ఆహ్వానించారు. యాజమాన్యం తరఫున పోర్టు మాజీ సీఈవో సాంబశివరావుతో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, కార్మిక సంఘాల నాయకులు జీవీ సత్యనారాయణ, కొవిరి అప్పలరాజు, జగన్, కనకరాజు తదితరులు చర్చించారు. అయితే చర్చలు ఫలించలేదు. వచ్చే బుధవారం లేదా గురువారం మరోమారు చర్చించాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి కూడా ఫోన్‌లో యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.


ధర్నాలో కూర్చున్న కార్పొరేటర్ దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను

**రూ.36వేలు వేతనం ఇవ్వాలి**

పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగించిన గంటిపల్లి లక్ష్మయ్య, కదిరి భూలోకరావు, కారి అప్పారావుతో పాటు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఏటా నెల జీతం బోనస్, 600 మంది కార్మికుల్లో 550 మంది మాత్రమే ఉన్నారని, మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ప్రత్యేక మెడికల్ పాలసీని ప్రవేశ పెట్టాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్, తక్షణమే నష్టపరిహారం ప్యాకేజీ, జీపీఎల్, జీపీఎస్ మధ్య అంతరాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

**ఆందోళన ఉధృతం చేస్తాం**



పోర్టు యాజమాన్యంతో చర్చలు ఫలిస్తే సరే సరి.. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం. ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా యాజమాన్య వైఖరిలో మార్పులేదు. ఈ సారి మాత్రం ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నాం.

– కదిరి పోలరాజు, జీపీఎస్ ఉద్యోగి

**అన్యాయం చేస్తే సహించం**



14 ఏళ్లుగా గంగవరం పోర్టు యాజమాన్యం జీపీఎస్ ఉద్యోగులకు అన్యాయం చేస్తోంది. ఈసారి మాత్రం డిమాండ్లు పరిష్కరించకపోతే సహించేది లేదు. అన్ని సంఘాలతో కలసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం.

– కొవిరి అప్పలరాజు, కార్మిక సంఘ నాయకుడు

# విశాఖ–రాయగడ సెక్షన్‌లో తనిఖీలు


రాయగడ స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్

**తాటిచెట్లపాలెం:** విశాఖపట్నం–రాయగడ సెక్షన్ పరిధిలో వాల్తేర్ డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి శనివారం విండో ట్రయలింగ్ తనిఖీలు చేపట్టారు. ఆయా స్టేషన్లలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు.

అభివృద్ధి పనులపై సమీక్షించారు. రాయగడలో కొత్తగా నిర్మిస్తున్న స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

జిమిడిపేటలో కొత్తగా నిర్మించిన సబ్ సెక్షన్ పోస్ట్, రాయగడలో కొత్తగా నిర్మించిన రెండు 500 కేవీ సబ్‌స్టేషన్లను ప్రారంభించారు. ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కో ఆర్డినేషన్ పి.కె.మహరాణా, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎస్.కె.పాత్ర తదితరులు పాల్గొన్నారు.

# గ్యాట్ -2023 ప్రారంభం

**కొమ్మాది (విశాఖ):** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్(బి.టెక్, ఎం.టెక్), బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, లా అండ్ సైన్స్, హ్యూమానిటీస్, నర్సింగ్, పారామెడికల్ కోర్సుల్లో 2023 విద్యా సంవత్సరానికి గానూ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష గ్యాట్–2023 శుక్రవారం ప్రారంభమైంది. గీతం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూర్ ప్రాంగణాల్లో నిర్వహిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికిగానూ 139 కేంద్రాల్లో ఈ నెల 3 వరకు పరీక్షలు జరుగుతాయని ప్రొఫెసర్ వై.గౌతమరావు తెలిపారు.

# సామాన్యులకు 5జీ సేవలు చేరాలి



మాట్లాడుతున్న మునిశేఖర్

**బీచ్‌రోడ్డు:** సామాన్యులకు 5జీ సేవలు చేరువ చేయాలని ట్రాయ్(టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా), హైదరాబాద్ సలహాదారు మునిశేఖర్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ట్రాయ్, విశాఖపట్నం ఆధ్వర్యంలో 5జీ మొబైల్ టెక్నాలజీ, డిజైన్ అండ్ డెవలప్‌మెంట్, అమలు, సవాళ్లు, వినియోగదారుల కేసులు అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో టెలికాం రంగాన్ని ప్రోత్సహించడంలో ట్రాయ్ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడానికి 5జీ సేవలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో డీడీజీ జె.వి.రాజారెడ్డి, వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజినీర్ పి.శివ ప్రసాద్, కె.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పొంగిన దేశభక్తి

**50 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ**

**ఆరిలోవ:** చినగదిలి దరి సంతపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 50 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు. పింగళి వెంకయ్య జాతీయ జెండా రూపొందించి 102 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హెచ్ఎం చిరికి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో జెండా ఆవిష్కరించారు. ముందుగా పింగళి చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం 50 అడుగుల జాతీయ జెండా ప్రదర్శిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ చేశారు. జాతీయ జెండాను అందరం గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు వాణి జయప్రభ, రాంబాయి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


సంతపాలెంలో 50 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

# కేఎల్‌యూ ప్రవేశ ఫలితాల విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

**దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ):** కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం విడుదల చేశారు. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో అమర్‌నాథ్ పాల్గొని బటన్ నొక్కి ఫలితాలు విడుదల చేసి, ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఉపయోగపడే పరిశోధనలపై యువత దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. చదువు పూర్తి చేసుకుని విద్యార్థి బయటకు వచ్చిన వెంటనే ఉద్యోగం కల్పించాలన్న లక్ష్యంతో స్కిల్ హబ్ సెంటర్ ద్వారా తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో ఐ స్పేస్ పేరిట ఐకానిక్ బిల్డింగ్ ఏర్పాటు కానుందన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందని, పలు కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని, మన విద్యార్థులకు ఇక్కడే మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలు వచ్చేలా పటిష్ట కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. కేఎల్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాలు www.kluniversity.in వెబ్‌సైట్‌లో లభిస్తాయని తెలిపారు. కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షణ్ముఖ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్లు బీఎస్ఎన్ మూర్తి, హెచ్ఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.

# చంద్రంపాలెం విద్యార్థుల ప్రతిభ



గెలుచుకున్న కప్‌లతో విద్యార్థులు

**మధురవాడ (భీమిలి):** చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబ కనబరుస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించిన పోటీలతో పాటు ప్రైవేటు సంస్థలు నిర్వహించిన పోటీల్లో కూడా తమదైన శైలిలో సత్తా చాటుతున్నారు. ఇటీవల డబ్ల్యూఎస్ఎస్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో ఫోకస్ ఆన్ సైన్స్ అనే అంశంపై నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో పదో తరగతికి చెందిన జి.రాజశేఖర్, ఆర్.వినయ్ తేజలు ప్రథమ స్థానంలో నిలిచి గ్లోబల్ చైల్డ్స్‌గా ఎంపికయ్యారు. 13 దేశాలకు చెందిన వివిధ పాఠశాలలు విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శ్రీకాంత్, ఎం. సాయిజ్యోతిలు విద్యార్థులను అభినందించారు.

# ఆర్నవ్‌కు ప్రముఖ వర్సిటీల నుంచి ఆఫర్లు


ఓక్రిడ్జ్ విద్యార్థి ఆర్నవ్ సాహూ

**తగరపువలస:** భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'ఇంటర్నేషనల్ బాకలారియేట్ డిప్లమో ప్రోగ్రాం' విద్యనభ్యసిస్తున్న ఆర్నవ్ సాహూకు ప్రముఖ వర్సిటీల్లో ఉన్నత విద్యనభ్యసించడానికి అవకాశాలు వస్తున్నట్టు ప్రిన్సిపాల్ శైలా భమిడిపాటి, కో–ఆర్డినేటర్ పల్లవి మిశ్రా తెలిపారు. స్కూల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కింగ్స్ కాలేజ్ లండన్, అరిజోనా విశ్వవిద్యాలయం, క్వీన్స్ మేరీ అండన్ యూనివర్సిటీ, పర్డ్యూ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, శాన్‌డిగో వంటి చోట ఆర్నివ్‌కు అవకాశాలు తలుపు తడుతున్నాయన్నారు. భువనేశ్వర్‌కు చెందిన ఆర్నివ్ తండ్రి ఉద్యోగం నిమిత్తం ఆఫ్రికాలో ఉండగా.. అక్కడ ఆర్నివ్ ఆరో గ్రేడ్ వరకు చదువుకున్నాడు. 2017లో ఏడో గ్రేడ్ నుంచి తమ పాఠశాలలో చదువుతున్నాడన్నారు. ఏడేళ్లుగా విద్య, క్రీడారంగంలో రాణించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాడని తెలిపారు.

**చికెన్ ధరలు**



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : రూ.105 |
| స్కిన్ | : రూ.180 |
| స్కిన్‌లెస్ | : రూ.190 |

**కోడిగుడ్ల ధరలు**

| | రూ.లలో (వందకు) |
|---|---|
| విశాఖ | 425.00 |
| విజయనగరం | 429.00 |
| శ్రీకాకుళం | 429.00 |

**విశాఖ బులియన్**

| | |
|---|---|
| 24 క్యారెట్స్(10 గ్రా.) | రూ.60,000 |
| 22 క్యారెట్స్(10 గ్రా.) | రూ.55,000 |
| వెండి(కిలో): | రూ.77,500 |